










# బాలయ్య సినిమాకు నేషనల్ అవార్డు

## 71వ ఉత్తమ చలన చిత్ర అవార్డుల ప్రకటన

### బెస్ట్ యాక్టర్స్‌గా దుమ్ములేపిన షారుక్ ఖాన్, విక్రాంత్ మస్సే.. ఉత్తమ నటి రాణీ ముఖర్జీ

- బెస్ట్ తెలుగు మూవీగా బాలయ్య 'భగవంత్ కేసరి'
- బలగం పాటకు కాసర్లశ్యామ్ కు అవార్డు
- ఏకంగా 7 అవార్డులు దక్కించుకున్న తెలుగు చిత్రసీమ

ఢిల్లీ, నేషనల్ ఫిల్మ్ అవార్డులను కేంద్రం అనౌన్స్ చేసింది. 2023 సంవత్సరానికి గాను ఈ అవార్డులను శుక్రవారం ప్రకటించారు. ఈ అవార్డు జ్యూరీ కమిటీ కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు నివేదికను అందజేసింది. మొత్తం 15 విభాగాల్లో అవార్డులను జ్యూరీ ఈ సందర్భంగా ప్రకటించింది. జాతీయ ఉత్తమ చిత్రంగా 12th ఫెయిల్‌కు అవార్డు దక్కింది. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును ఇద్దరు నటులు పంచుకున్నారు. షారుక్ ఖాన్(జవాన్), విక్రాంత్ మస్సే(12th ఫెయిల్) ఎంపికయ్యారు. మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే (హిందీ)లో నటనకు గాను రాణీ ముఖర్జీని ఉత్తమ నటి అవార్డు వరించింది. అలాగే ఉత్తమ తెలుగు చిత్రంగా ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరీ నిలిచింది. అలాగే హనుమాన్, బలగం, బేబి, గాంధీ తాత చెట్టు లాంటి వాటికి కూడా అవార్డులు దక్కాయి. ఇక షారుక్ ఖాన్, విక్రాంత్ మస్సే బెస్ట్ యాక్టర్స్ అవార్డులు దక్కించుకోగా.. రాణీ ముఖర్జీ బెస్ట్ యాక్ట్రెస్‌గా నిలిచింది. ఉత్తమ యాక్షన్ (స్టంట్ కొరియోగ్రఫీ)లో హనుమాన్ చిత్రం అవార్డు అందుకోగా.. ఉత్తమ గేయ రచయితగా కాసర్ల శ్యామ్ (బలగం) అవార్డును సొంతం చేసుకున్నారు. దీంతో వరుసగా ఈ ఏడాది కూడా తెలుగు సినిమాలు జాతీయ స్థాయిలో సత్తా చాటినట్లు అయింది.

నేషనల్ ఫిల్మ్ అవార్డులు..

ఉత్తమ తెలుగు చిత్రం: భగవంత్ కేసరి
ఉత్తమ తమిళ చిత్రం: పార్కింగ్
ఉత్తమ పంజాబీ చిత్రం: గొడ్డె గొడ్డె చా
ఉత్తమ ఒడియా చిత్రం: పుష్కర
ఉత్తమ మరాఠీ చిత్రం: శ్యామ్‌చి ఆయీ
ఉత్తమ మలయాళ చిత్రం: ఉళ్లులుక్కు
ఉత్తమ కన్నడ చిత్రం: కందీలు
ఉత్తమ హిందీ చిత్రం: కథల్
ఉత్తమ గుజరాతీ చిత్రం: వష్
ఉత్తమ బెంగాలీ చిత్రం: డీప్ ఫ్రిడ్జ్
ఉత్తమ అస్సామీ చిత్రం: రొంగటపు 1982
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్: నందుపృథ్వీ (హనుమాన్)
ఉత్తమ కొరియోగ్రఫీ: వైభవి మర్చంట్ (ఢింఢోరా బాజే రే రాకీ ఔర్ రాణీ కి ప్రేమ్ కహానీ)
ఉత్తమ సాహిత్యం: కాసర్ల శ్యామ్ (ఊరు పల్లెటూరు బలగం)
ఉత్తమ సంగీత దర్శకత్వం: జి.వి.ప్రకాష్ కుమార్ (వాతి), హర్షవర్ధన్ రామేశ్వర్ (యానిమల్)
ఉత్తమ మేకప్: శ్రీకాంత్ దేశాయ్ (శామ్ బహదూర్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్: సచిన్, దివ్య, నిధి (శామ్ బహదూర్)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: మోహన్‌దాస్ (2018)
ఉత్తమ ఎడిటింగ్: మిథున్ మురళి (పూక్కాళం)
ఉత్తమ సౌండ్ డిజైన్: సచిన్ సుధాకరన్, హరిహరన్ (యానిమల్)
ఉత్తమ స్క్రీన్‌ప్లే: సాయి రాజేష్ (బేబి), రామ్‌కుమార్ బాలకృష్ణన్ (పార్కింగ్)
ఉత్తమ సంభాషణలు: దీపక్ కింగ్ రాణి (సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: ప్రశాంతను మహాపాత్ర (ది కేరళ స్టోరీ)
ఉత్తమ నేపథ్య గాయకులు: శిల్పా రావు (ఛలియా జవాన్), రోహిత్ (ప్రేమిస్తున్నా బేబి)
ఉత్తమ బాల నటులు: సుకృతి బండిరెడ్డి (గాంధీ తాత చెట్టు), కబీర్ఖండారే (జిప్సీ), ట్రీష తోషార్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ (నాల్ 2)
ఉత్తమ సహాయ నటులు: ఊర్వశి (ఉళ్లుళుక్కు), జాన్కి బోడివాలా (వష్), విజయరాఘవన్ (పూక్కాళం), ముత్తుపేట్టై సోము భాస్కర్ (పార్కింగ్)
ఉత్తమ ప్రధాన నటులు: రాణీ ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే), షారూఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12th ఫెయిల్)
ఉత్తమ దర్శకత్వం: సుదీప్తో సేన్ (ది కేరళ స్టోరీ)
ఉత్తమ ఏవీజీసీ చిత్రం: హనుమాన్



ఉత్తమ బాలల చిత్రం: నాల్ 2
జాతీయ, సామాజిక విలువలను ప్రోత్సహించిన
ఉత్తమ చిత్రం: శామ్ బహదూర్
జాతీయ ఉత్తమ చిత్రం: 12th ఫెయిల్

# అనుష్కా శెట్టి ఘాటి రిలీజ్ అప్పుడేనా?

అనుష్కా శెట్టి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఘాటి'. ఈ సినిమాలో విక్రమ్ ప్రభు మరో కీలక పాత్రలో నటించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో జాగర్ల మూడి రాధాకృష్ణ (క్రిష్) దర్శకత్వంలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. జూలైలో విడుదల కావాల్సిన ఈ సినిమా రిలీజ్ వాయిదా పడిన సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమాను నవంబరులో రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. వీఎఫ్ఎక్స్ వర్క్స్‌పై మరింత శ్రద్ధ పెట్టి, మంచి క్వాలిటీతో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలన్నది టీమ్ ప్లాన్.దీంతో ఓ దశలో సెప్టెంబరులో రిలీజ్ అనుకున్నప్పటికీ నవంబరులో అయితే మరిన్ని థియేటర్స్ కూడా దొరకుతాయని, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌కు మరింత సమయం లభిస్తుందని కూడా చిత్రయూనిట్ ఆలోచిస్తోందట. అయితే ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. 'ఘాటి' సినిమా తెలుగు, తమిళ, హిందీ, మలయాళంతో సహా పలు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. ఈ సినిమాకు సంగీతం: నాగవెల్లి విద్యాసాగర్.



# బాణామతి బ్యాక్‌డ్రాప్‌లో చేతబడి సినిమా

శ్రీ శారద రమణా క్రియేషన్స్ బ్యానర్‌పై నంద కిషోర్ నిర్మిస్తున్న సినిమా 'చేతబడి'. కొత్త దర్శకుడు సూర్యాస్ ఈ మూవీని నిజజీవిత సంఘటనల ఆఘారంగా తెరకెక్కించారు. తాజాగా లుక్ రిలీజ్ చేయడంతో పాటు చిత్ర విశేషాలని దర్శకుడు మీడియాతో పంచుకున్నాడు. చేతబడి.. 16వ శతాబ్దంలో మన దేశంలో పుట్టింది. రెండు దేశాలు కొట్టుకోవాలన్న రెండు దేశాలు కలవాలన్నా.. ఒక బలగం ఉండాలి. కానీ ఒక చెడు శక్తితో మనిషిని కలవకుండా అతన్ని చంపే విద్యే చేతబడి. అది ఎంత భయంకరంగా ఉంటుందో ఇప్పటికే చాలా సినిమాల్లో చూపించారు. ఇందులో చాలా విభిన్నంగా చూపిస్తున్నాం. మన శరీరంలో ప్రతిదానికి ఓ ప్రాణం ఉంటుంది. జుట్టుకు కూడా ఒక ప్రాణం ఉంటుంది. ఆ వెంట్రుకల ఆధారంగానే ఈ సినిమా ఆధారపడి ఉంటుందని సూర్యాస్ తెలిపాడు. 1953 గిరిడ అనే గ్రామంలో యదార్థ సంఘటన ఆధారంగా చేసుకుని ఈ కథని సిద్ధం చేశారు. సీలేరు అనే గ్రామంలో 200 సంవత్సరాల క్రితం వెదురు బొంగులు చాలా దట్టంగా ఉంటాయి. వర్షం పడినా అవి నెలలోకి దిగవు. అలాంటి మట్టిలో బతికున్న నల్లకోడిని పెట్టి అమావాస్య రోజు బాణామతి చేస్తే ఎలా ఉంటుంది అనేది ఇందులో చూపించబోతున్నామని దర్శకుడు సూర్యాస్ చెప్పుకొచ్చాడు.



# యోగి ఆదిత్యనాథ్‌పై బయోపిక్.. విడుదలకు అడ్డుగా సెన్సార్ బోర్డ్




ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆధారంగా రూపొందుతున్న సినిమా 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఎ యోగి'.. దర్వకుడు రవీంద్ర గౌతమ్ తెరకెక్కిస్తున్నారు. అయితే, ఈ సినిమా విడుదలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) అడ్డుచెప్పింది. దీంతో చిత్ర యూనిట్ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. సర్టిఫికేషన్ దరఖాస్తులను తిరస్కరించడాన్ని సెన్సార్‌ను తప్పుబడుతూ వారు కోర్టులో సవాలు చేశారు. 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఎ యోగి' చిత్రంలో యోగి ఆదిత్యనాథ్ పాత్రలో అనంత్ జోషి నటించారు. ఆయన గురువు మహంత్ పాత్రలో పరేష్ రావల్ నటించారు. అయితే, ఈ సినిమా విడుదలకు సెన్సార్ బోర్డు అడ్డుచెప్పింది. దీంతో చిత్ర నిర్మాతలు ముంబై కోర్టును ఆశ్రయించి తమ వాదనను వినిపించారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో ఉన్న నవల ఆధారంగానే ఈ చిత్రాన్ని తెరకెక్కించామని చిత్ర నిర్మాతలు కోర్టుకు తెలిపారు. దీంతో ఇదే విధంగానే న్యాయస్థానం కూడా సెన్సార్ బోర్డును ప్రశ్నించింది. పుస్తకంపై ఎలాంటి సమస్యలు లేనప్పుడు సినిమాకు అభ్యంతరాలు ఎందుకని న్యాయమూర్తులు రేవతి మోహితే డెరే, నీలా గోఖలేలతో కూడిన ధర్మాసనం సెన్సార్ బోర్డును ప్రశ్నించింది. పుస్తకం ప్రజాక్షేత్రంలో ఉన్నప్పుడు లేని ఇబ్బంది సినిమా విడుదలకు ఎందుకు వస్తుందని న్యాయస్థానం నిలదీసింది. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని CBFCకి కోర్టు నోటీసు జారీ చేసింది.

# సినీ కార్మికుల వేతనాల పెంపు.. గడువు కోరిన ఫిల్మ్ ఛాంబర్




సినీ కార్మికుల వేతనాల పెంపుపై ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి గడువు కోరింది. ఈ మేరకు కార్మిక శాఖ కమిషనర్‌ను కలిసిన ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి ప్రతినిధులు రెండు రోజులు గడువు కోరారు. ఈ విషయాన్ని సినీ వర్కర్స్ ఫెడరేషన్ ప్రతినిధులకు కార్మిక శాఖ కమిషనర్ తెలిపారు. ఛాంబర్ ప్రతినిధులు, ఫెడరేషన్ ప్రతినిధులతో రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కార్మిక శాఖ కమిషనర్ వెల్లడించారు. అంత వరకు షూటింగ్స్ ఆపవద్దని ఫెడరేషన్ ప్రతినిధులను కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఇరు వర్గాలతో చర్చల ద్వారా కార్మికుల వేతనాల సమస్య ఓ కొలొక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com